
నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, సోమవారం 17 మార్చి 2025 | KHAMMAM

మార్చి నెల మూడో వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. గడిచిన పదిహేను రోజుల నుంచి దంచికొడుతున్నాయి. ఉదయం పది దాటకముందే భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. పాదచారులు, చిరువ్యాపారులు ఎండకు తాళ లేక నెత్తిన రుమాళ్లు వేసుకుంటున్నారు. వృద్ధులు బయటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఉపాధి హామీ కూలీలు తెల్లవారేసరికి పనుల స్థలాలకు చేరుకుంటున్నారు. ఎండల ధాటికి తట్టుకోలేక కొందరు ఇళ్లకు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలను దాటిపోయాయి. గడిచిన రెండు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గినట్లు కన్పిస్తున్నప్పటికీ అంతకు వారం రోజుల క్రితం వరకూ పగటి వేళలోనే 33 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం.

–భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం, మార్చి 16



# భగభగ... సుర సుర...



- మార్చి నెలలోనే మండుతున్న ఎండలు
- ఉమ్మడి ఖమ్మంపై పెరిగిన భానుడి ప్రతాపం
- ఓవైపు బొగ్గుబావులు, మరోవైపు పరిశ్రమలు
- ఇప్పటికే 33 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పంటున్న వైద్యులు



నిర్మానుష్యంగా ఉన్న ఖమ్మం జడ్పీ సెంటర్

గడిచిన రెండు రోజులుగా జిల్లాలో చిత్రమైన వాతావరణం కన్పిస్తోంది. గత 15 రోజులుగా 30 నుంచి 33 డిగ్రీల వరకూ పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి కూడా వేడి వాతావరణమే ఉండేది. కానీ రెండు రోజులుగా పగలు విపరీతమైన ఎండ కొడుతున్నప్పటికీ రాత్రి మాత్రం చల్లగాలులు వీస్తున్నాయి. అయితే, ఫిబ్రవరిలోనే తీవ్రరూపం దాల్చిన ఎండలు.. సగటున 30 డిగ్రీల వరకూ నమోదయ్యాయి. మార్చి ప్రథమార్థంలోనే 33 డిగ్రీలు నమోదవుతుండడంతో రానున్న ఏప్రిల్, మే నెలల ఎండల తీవ్రత గురించి జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో పగటి వేళలో పనుల మీద బయటకు వచ్చే ప్రజలు నెత్తిన రుమాళ్లు కప్పుకుంటున్నారు. ఇతర జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రహదారులపై ప్రయాణాలు చేస్తున్న వారు హడలిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలోనే తలపై వస్త్రాలు కప్పుకొని బయటకు వస్తున్నారు. ఎండలు ముదురుతుండడంతో శీతల పానీయల విక్రయాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి.



## ఏప్రిల్, మే నెలలతో బెంబేలు..

గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సుమారు 50 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలను తలచుకుంటూ ఉమ్మడి జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గడిచిన రెండు మూడు రోజులుగా రాత్రి పూట వాతావరణం చల్లబడడం కూడా రానున్న ఎండల తీవ్రతకు సంకేతమేమో నని భావిస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల కోసం బైకులకు బదులు ఆటోలు, బస్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. అయితే, ఆటోల్లో ప్రయాణించే వారు కూడా ఎండ వేడిమిని, వడగాడ్పులను తాళలేకపోతున్నారు. రహదారుల విస్తరణ, విద్యుత్ లైన్ల కోసం రోడ్ల వెంట ఉన్న భారీ వృక్షాలు, చెట్లను నరికి వేయడంతో రహదారులపై ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటోంది. దీంతో రహదారుల వెంట కొబ్బరిబోండాలు, పుచ్చకాయలు, చెరుకు రసం సహా ఇతర పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, విక్రయాలు పెరిగిపోయాయి.

## పారిశ్రామిక ప్రాంతాల్లో మరింతగా..

ఇంకా రెండు నెలలు కాలం ఉన్నా ముందస్తుగా ఎండలు మండిపోతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. వచ్చే రెండునెలలు ఇంకా ఎన్ని ఎండలు ఉంటాయో అని జనాలు భయపడుతున్నారు. అసలే బొగ్గు గనుల ప్రాంతం, అందులో పరిశ్రమలకు కేరాఫ్‌గా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు ఉండడంతో వేసవిలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వాతావరణశాఖ కూడా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు భారీగానే నమోదవుతాయని చెబుతున్నది. 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదాలు ఉంటాయంటున్నారు.

## షుగర్ రోగులకు తప్పని తిప్పలు..

వేసవికాలం వచ్చిందంటే చాలు డయాబెటిస్ రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఎండల్లో బయటకు వెళ్లినా వేడి ప్రదేశాల్లో ఉన్నా షుగర్ పెరిగే అవకాశాలు లేకపోలేదు. దీనివల్ల డయాబెటిస్ రోగులు ఇంటికే పరిమితం కావాల్సి వస్తున్నది. అందులో వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోక తప్పదు. ఎన్ని మందులు వాడినా వేడివల్ల షుగర్ అమాంతంగా పెరిగిపోతుంది. అరికాళ్ల మంటలు వచ్చి ఏసీలు లేకపోతే ఉండలేకపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.





కొత్తగూడెం పట్టణంలో ఉదయం 11 గంటలకే తలపై స్కార్ఫ్‌లు కప్పుకొని వెళ్తున్న మహిళలు



### జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పే..

వ్యాధులబారిన ఉన్నవారు ఎండలు పెరిగిన కొద్దీ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా డయాబెటిక్ రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ నీరు తాగడం, తినాల్సిన పండ్లు మాత్రమే తినడం, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఎండకు బయటకు వస్తే ప్రమాదంలో పడతారు. వృద్ధులది కూడా అదే పరిస్థితి. వారానికి ఒకసారైనా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలి. అలసటకు గురికాకుండా చూసుకోవాలి.

–డాక్టర్ పుష్పలత, ఎండీ జనరల్ మెడిసిన్, కొత్తగూడెం





# రంజాన్ మాసం.. ఎంతో పవిత్రం

ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఇఫ్తార్‌కు ముందు ముస్లింలతో కలిసి ప్రత్యేక నమాజు ఆచరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్

రఘునాథపాలెం, మార్చి 16: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ముస్లింలు ఎంతో నిష్టతో నెలంతా దీక్షలు చేస్తారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం ఖిల్లా మసీద్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో పువ్వాడ పాల్గొని ముస్లింలతో కలిసి నమాజు చేశారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో అందరూ కలిసిమెలిసి జీవించినప్పుడే మత సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్ మక్బూల్, షౌకత్ అలీ, నాగండ్ల కోటేశ్వరరావు, బిక్కసాని జస్వంత్, నజీముద్దీన్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, తౌసిఫ్ ముజాహిద్, తోసిఫ్, అసద్, హరికృష్ణ, రాధాకృష్ణ, ఆసిఫ్, మున్నా, చంటి పాల్గొన్నారు.

# 'పొట్టి శ్రీరాములు' పేరును.. మార్చితే ఊరుకోం

- తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరును ఉంచాల్సిందే..
- కాంగ్రెస్ తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు
- ఖమ్మం సమావేశంలో ఆర్యవైశ్య ప్రముఖుల స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ఖమ్మం, మార్చి 16: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మరిచిందని ఖమ్మానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు మండిపడ్డారు. ఆయనకు అవమానం కలిగేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ నేత గీతారెడ్డి మాతృమూర్తి ఈశ్వరీబాయి పేరు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఆక్షేపణీయమైనవని అన్నారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగించే ప్రయత్నాలను సీఎం రేవంత్‌రెడ్డి మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఖమ్మంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా, నగర కమిటీ సమావేశంలో సంఘం నేతలు పసుమర్తి చంద్రరావు, గుమ్మడవెల్లి శ్రీనివాసరావు, మేళ్లచెరువు వెంకటేశ్వర రావు, గోళ్ల రాధాకృష్ణ, చిన్ని కృష్ణారావు, దేవకి వాసుదేవరావు, సన్నే ఉదయప్రతాప్, కొప్పు నరేశ్, కొత్త వెంకటేశ్వరరావు, పాల్వాయి వెంకటేశ్వరరావు, కొణతం లక్ష్మీనారాయణ, పాల్వాయి సీతయ్య, విన్నమూరి సుబ్బారావు, మిట్టపల్లి రవి తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలని ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని అన్నారు. అది సరైన పద్ధతి కాదని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించిన గత ప్రభుత్వాలు.. వర్సిటీకి ఉన్న ఆయన పేరును తొలగించేందుకే ఏనాడూ ప్రయత్నించలేదని గుర్తుచేశారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ ఆలోచన ఎంతో బాధాకరమని, ఇలాంటి ఆలోచనతో త్యాగమూర్తిని అవమానపరిచినట్టు అవుతోందని అన్నారు. అమరజీవి పేరు మార్చే ప్రయత్నం చేస్తే తెలుగు రాష్ట్రాల్లోని ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసినట్టు అవుతుందని అన్నారు. అదే జరిగితే తమ ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆర్యవైశులందరమూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఖండిస్తున్నామని అన్నారు. పేరు మార్చే ప్రయత్నాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆపకపోతే మున్ముందు చాలా తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పునరుద్ఘాటించారు.

# 'భగీరథ'ను పట్టించుకోవడం లేదు

- పగిలిన పైపులకు ప్రభుత్వం మరమ్మతులు చేయలేదు
- నెల రోజులుగా తాగునీళ్లు అందక తల్లడిల్లిపోతున్నాం
- భద్రాద్రి జిల్లా దుబ్బ తండా వాసుల ఆందోళన
- మిషన్ భగీరథ ట్యాంకు ఎక్కి నినాదాలు.. నిరసన..

జూలూరుపాడు, మార్చి 16:గత కేసీఆర్ ప్రభుత్వంలో తమ ఇళ్లకు శుద్ధజలాలు అందించిన మిషన్ భగీరథ ట్యాంకును ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల పంచాయతీ దుబ్బతండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకుకు నీళ్లు ఎక్కించే పైపులు పగిలి నెల రోజులు దాటుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపిస్తున్నారు. వాటికి మరమ్మతులు చేసి ట్యాంకుకు నీళ్లు ఎక్కించి తమకు సరఫరా చేసేందుకు కనీస చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. గడిచిన నెల రోజుల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమస్యను వివరించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం తండావాసులంతా కలిసి ఖాళీ బిందెలతో ట్యాంకు పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పైపులకు మరమ్మతులు చేయించి తమకు వెంటనే తాగునీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాగేందుకు కనీసం గుక్కెడు నీళ్లు కూడా అందకపోవడంతో ఇళ్లలో పిల్లలమూ, పెద్దలమూ తల్లడిల్లిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తొడ వరకూ కాలు లేని ఓ దివ్యాంగ యువకుడు కూడా కర్ర సహాయంతో ఒంటికాలితో ట్యాంకుపైకి చేరుకొని నినాదాలు చేయడం గ్రామంలోని తాగునీటి తీవ్రతకు అద్దం పడుతోంది. కాగా, స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్.. ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం వెంటనే చర్యలు చేపడతామని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో తండావాసులు ఆందోళన విరమించారు.



ట్యాంకుపై దివ్యాంగుడు

తాగునీటి కోసం మిషన్ భగీరథ ట్యాంకుపై ఆందోళన చేసి ఎమ్మెల్యే హామీ మేరకు దిగుతున్న గ్రామస్తులు

# పచ్చదనం మటుమాయం

- పల్లెల్లో కనిపించని గ్రీనరీ
- నర్సరీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఎండిపోతున్న మొక్కలు
- హరితహారంపై అధికారుల అశ్రద్ధ



అడవిని తలపిస్తున్న మేకలతండా నర్సరీ

తిరుమలాయపాలెం, మార్చి 16: పల్లెల్లో పచ్చదనం మాయమైపోయింది. నర్సరీల నిర్వహణపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈజీఎస్ ఆధ్వర్యంలో పలు గ్రామ పంచాయతీల్లో చేపట్టిన నర్సరీల్లో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. వచ్చే వానకాలానికి మొక్కలు పెంచాల్సిన నర్సరీలు బీళ్లుగా మారిపోయి రూపురేఖలే లేకుండా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలంలోని జోగులపాడులో హరితహారం మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. జల్లేపల్లి నర్సరీ వద్ద అదే దుస్థితి. మేకలతండాలో మొక్కలు పెంచాల్సిన నర్సరీ బీడుగా మారింది. చంద్రుతండా, గోల్‌తండా, తిప్పారెడ్డిగూడెం, పాతర్లపాడు, హైదర్‌సాయిపేట, ఇస్లావత్ తండాల్లోనూ నర్సరీల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఆయా గ్రామాల్లోని స్థితిగతులను బట్టి మొక్కల పెంపకంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వానకాలం సీజన్‌లో మొక్కల పెంపకంపై దృష్టి పెట్టకపోవడంతో నిధుల దుర్వినియోగంతోపాటు పల్లెల్లో పచ్చదనం కనుమరుగైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పల్లెల్లో పచ్చదనాన్ని పెంపొందించి కాలుష్యాన్ని నివారించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని అమలుచేసిన విషయం విదితమే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచి విస్తృతంగా వరుసగా ఆరేళ్లపాటు మొక్కల పెంపకం చేపట్టింది. గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన హరితహారం ప్రోగ్రాన్ని అపహాస్యం చేస్తున్నది. పల్లెల్లో నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు కళ తప్పాయి. ఈ ఏడాది కూడ 40గ్రామాల్లో రూ.40 లక్షల వ్యయంతో 1.60 లక్షల మొక్కల పెంపకం చేపట్టినట్లు ఇప్పటికే నర్సరీల్లో మొక్కల పెంపకం మొదలైనట్లు ఈజీఎస్ ఏపీవో నర్సింహారావు తెలిపారు. కానీ గ్రామాల్లో పరిశీలిస్తే పలు ప్రాంతాల్లో నర్సరీలు ఇప్పటికీ బీళ్లు పిచ్చిచెట్లు, పొదలతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి నర్సరీల్లో సవ్యంగా మొక్కల పెంకం చేపట్టి వచ్చే వానకాలం సీజన్‌లో మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రకృతి వనాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జల్లేపల్లి నర్సరీలో ఎండిపోయిన మొక్కలు



జోగులపాడులో ఎండిపోయిన హరితహారం మొక్కలు